ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 1 ఫిబ్రవరి 2024



కూరగాయల మాటున..

మద్యం అక్రమ రవాణా

- పోలీసుల దాడులు.. ఐదుగురు అరెస్టు
- రూ.12.52 లక్షలు విలువ చేసే మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప (క్రైం), జనవరి 31: కూరగాయలు బాక్సుల మాటున గోవా రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను అక్రమంగా ఐచర్ వాహనంలో ప్రొద్దుటూరుకు తీసుకువస్తుండగా ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసులు దాడి చేశారు. రూ.12.52 లక్షలు విలువ చేసే మద్యం బాటిళ్లను, ఐచర్ వాహనం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సిద్దార్థ కౌశల్ అధికారులతో కలిసి వెల్లడించారు. నంద్యాల జిల్లా డోన్ టౌన్‌లోని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఈడిగ శ్రీధర్ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అలాగే ప్రొద్దుటూరు టౌన్ నడింపల్లెకి చెందిన వేంపల్లె రవికుమార్‌రెడ్డి, నంద్యాల జిల్లా డోన్ టౌన్‌లోని తారక్‌నగర్‌కు చెందిన రేకలకుంట్ల వనీత్‌కుమార్‌రెడ్డి, అదే ప్రాంతానికి చెందిన బి.శ్రీరాములు, ఈడిగ రవిలు ఐచర్ వాహనంతో గోవాకు వెళ్లి అక్కడ మద్యం కొనుగోలు చేసి.. వాటిపై కూరగాయల అట్టపెట్టెలను సమకూర్చి ప్రొద్దుటూరుకు తీసుకువస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ ఇబ్రహీం, ప్రొద్దుటూరు సెబ్ ఇన్‌స్పెక్టరు మహేష్‌కుమార్, ఎస్ఐ కిశోర్ సిబ్బందితో నిఘా ఉంచి మంగళవారం పట్టుకున్నారు. ఐచర్ వాహనం తనిఖీ చేయడంతో లోపల మద్యం బాటిళ్లను గుర్తించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 750 ఎంఎల్ కలిగిన 1252 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, మద్యం బాటిళ్లు, ఐచర్ వాహనం విలువ రూ.12.52 లక్షలు ఉంటుందన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప (ఎడ్యుకేషన్), జనవరి 31: వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యా యం చేసిందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ధ్వజమెత్తారు. ప్రభుత్వ విద్యావిధానం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. బకాయిలు చెల్లించకుంటే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు రిలేదీక్షలను నిర్వహించారు. ఈ దీక్షలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటామని, ఉద్యోగుల అన్నిరకాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ఉద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల వేతనాల్లో కోత విధించి చరిత్రకెక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేస్తామని ప్రకటించి.. జీపీఎస్ విధానం ప్రవేశపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ములను ఉద్యోగులకు తెలియకుండానే ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించుకోవడం దుర్మార్గ చర్య అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాలసిన ఆర్థిక బకాయలు చెల్లించేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఫిబ్రవరి 3 వరకు రిలేదీక్షలు కొనసాగిస్తామని, ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షల్లో యూటీఎఫ్ నాయకులు వై.రవికుమార్, సుజాతారాణి, కె.నరసింహారావు, కె.చెన్నయ్య, రవీంద్రుడు, ఎజాజ్ అహ్మద్, ఎం.ప్రభాకర్, డి.రూతు ఆరోగ్యమేరీ, ఎంఏ రమణయ్య, గంగన్న పాల్గొన్నారు.

కడప జిల్లా అదనపు ఎస్పీగా సుధాకర్



కడప (క్రైం), జనవరి 31: కడప జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా లోసారి సుధాకర్‌ను.. అలాగే నంద్యాల జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తున్న జి.వెంకటరాముడును కడప సెబ్ ఏఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1996 బ్యాచ్‌కు చెందిన లోసారి సుధాకర్ ఎస్ఐగా, సీఐగా కడప జిల్లాలో పనిచేశారు. అలాగే డీఎస్పీగా కడప మహిళా పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన వెయిటింగ్ లిస్టులో ఉండగా.. కడప అదనపు ఎస్పీగా పోస్టింగ్ కల్పించారు. ఏఎస్పీలు సుధాకర్, వెంకటరాముడు రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. కడప సెబ్ ఏఎస్పీగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ నంద్యాలకు బదిలీ కాగా.. అదనపు ఎస్పీగా పనిచేసిన తుషార్ డూడి గుంటూరు ఏఎస్పీగా వెళ్లారు.

టీడీపీలోకి భారీగా వైసీపీ నేతల వలసలు

- జీర్ణించుకోలేని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- టీడీపీ వర్గీయులపై దాడి
- ఎమ్మెల్యేపై తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు
- తెలుగు తమ్ముళ్లకు అండగా భూపేష్‌రెడ్డి
- రోడ్డుపై బైఠాయించి నిరసన
- ఎమ్మెల్యేకు వత్తాసు పలికిన పోలీసులు
- ఘర్షణ జరుగుతుందని తెలిసినా.. పోలీసుల మౌనం

జమ్మలమడుగు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పై పార్టీలో అసమ్మతి పెరిగింది. దీనికి తోడు జగన్ ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలను పార్టీతో పాటు ఎమ్మెల్యే పూర్తిగా విస్మరించారు. కేవలం ఎమ్మెల్యే తన అక్రమ సంపాదన మీద తప్ప మండలాల్లో పార్టీ నేతలను కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే పై వ్యతిరేకత తీవ్రతరమైంది. దీంతో ప్రాధాన్యత లేని చోట ఎందుకు ఉండాలని వైసీపీ లోని ముఖ్యనేతలంతా టీడీపీలోకి వలస బాటపట్టారు. దీన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన వైఫల్యాలను గుర్తించకుండా పార్టీ మారుతున్న వైసీపీ వారితో పాటు టీడీపీ నేతలపై నేరుగా దౌర్జన్యానికి తెగబడ్డారు. ఈ దాడులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తీరు తీవ్ర చర్చనీయాశంగా మారింది.




రోడ్డు పై బైఠాయించిన భూపేష్‌రెడ్డి



శశిధర్‌రెడ్డి ఇంటి వద్ద భారీగా వైసీపీ, టీడీపీ నాయకులు



పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులు



రోడ్డు పైపడ్డ కుర్చీలు, రాళ్లు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దాడిలో గాయపడ్డ టీడీపీ మండల అధ్యక్షుడు చింతా శివరామిరెడ్డి

ముద్దనూరు, జనవరి 31: ముద్దనూరులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు ఆయన వర్గం టీడీపీ వర్గీయులపై దాడికి పాల్పడింది. బుధవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేనమామ కుడుముల శశిధర్‌రెడ్డి సమక్షంలో భారీఎత్తున టీడీపీలోకి చేరికలు జరుగుతుండటంతో జీర్ణించుకోలేని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి టీడీపీ వర్గీయులపై దాడికి పాల్పడ్డారు. మండల టీడీపీ అధ్యక్షుడు చింతాశివరామిరెడ్డిపై ఎమ్మెల్యే భౌతిక దాడి చేశారు. పక్కన ఉన్న తెలుగు తమ్ముళ్లు ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డిపై తిరగబడ్డారు. ఇదంతా కళ్లముందరే జరుగుతున్నా ఘర్షణలను నివారించాల్సిన పోలీసులు అధికారపార్టీకి వత్తాసు పలకడంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. పోలీసులు మౌనం వహించడంతో కుర్చీలు, రాళ్లతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు దిగారు.దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఘర్షణ జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, ఎమ్మెల్యే సెక్యూరిటీ వైసీపీ నాయకులతో కలిసి కవరేజీకి వచ్చిన పత్రికా విలేకరులను వీడియోలు, ఫొటోలు తీయకుండా అడ్డుకునే పనిలో పడిపోయారు. మండల పోలీసులే కాక ఇతర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున పోలీసులు తరలివచ్చారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వరుసకు మేనమామైన కుడుముల శశిధర్‌రెడ్డి దాదాపు మూడు సంవత్సరాలుగా ఎమ్మెల్యేతో విబేధించి ఎర్రగుంట్ల మండలానికి చెందిన గంగవరం శేఖర్‌రెడ్డి వర్గంలో ఉన్నాడు. గత కొద్ది రోజుల క్రితం గంగవరం శేఖర్‌రెడ్డి తన వర్గంతో కమలాపురంలో ఇటీవల జరిగిన సభలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. అప్పటి నుంచి శశిధర్‌రెడ్డి టీడీపీ కార్యాలయానికి వస్తూ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బుధవారం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద భూపేష్‌రెడ్డి సమక్షంలో భారీ ఎత్తున టీడీపీలోకి చేరికలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి కొంతమంది టీడీపీ ముఖ్యనాయకులు శశిధర్‌రెడ్డి ఇంటి వద్ద సన్నాహాలు చేస్తున్నారు. ఇంతలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే మేనమామ కుడుముల మునిరాజారెడ్డి తమ అనుచరవర్గంతో శశిధర్‌రెడ్డి ఇంటికి వచ్చిన టీడీపీ వర్గీయులపై దాడికి దిగారు. మండల టీడీపీ అధ్యక్షుడు చింతాశివరామిరెడ్డి చొక్కా పట్టుకొని దాడి చేశారు. వెంటనే అక్కడే ఉన్న టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై తిరగబడ్డారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఘర్షణ జరుగుతుందని తెలిసి పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. శశిధర్‌రెడ్డి ఇంటి నుంచి టీడీపీ వర్గీయులను పోలీసులు బలవంతంగా బయటకు లాగేశారు. ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి, మునిరాజారెడ్డి, వైసీపీ వర్గీయులు మాత్రం శశిధర్‌రెడ్డి ఇంటిలోనే ఉండిపోయారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డికి సమాచారం అందడంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. దీంతో శశిధర్‌రెడ్డి ఇంటిలో ఉన్న ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి వర్గం భయట రోడ్డుపై నున్న టీడీపీ నాయకులపై కుర్చీలు విసిరారు. దీంతో ఇరువర్గాలు రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దాడులకు నిరసనగా భూపేష్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. అనంతరం పోలీసులు భూపేష్‌రెడ్డికి సర్దిచెప్పి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాలు భారీ ఎత్తున మోహరించటంతో ముద్దనూరులో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరువర్గాలను పోలీసులు అదుపుచేశారు.

స్వచ్ఛందంగా చేరికలు : భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు నియోజకవర్గంలో భారీ ఎత్తున స్వచ్ఛందంగా వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు జరుగుతున్నాయి. చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మి స్వచ్ఛందంగా టీడీపీలోకి వస్తున్నారు. శశధర్‌రెడ్డి జనవరి 19న టీడీపీలో చేరడం జరిగింది. ఇది జీర్ణించుకోలేక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి టీడీపీ వర్గీయులపై దాడికి పాల్పడ్డారు.

ప్రలోభాలకు గురి చేస్తున్నారు

- ఎమ్మెల్యే



సంఘటనా స్థలం వద్ద మోహరించిన పోలీసులు

టీడీపీ నాయకులు వైసీపీ నాయకులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మా ఇళ్ల వద్దకు(శశిధర్‌రెడ్డి ఇంటి వద్దకు) టీడీపీ వాళ్లను ఎవరు రమ్మన్నారు. కేవలం కుటుంబంలో చిచ్చు పెట్టేందుకు వస్తున్నారు. ఇప్పుడు కూడా శశిధర్‌రెడ్డి వైసీపీ కండువా వేసుకొని ఉన్నారు. అయితే శశిధర్‌రెడ్డి ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఉండిపోయారు. రోడ్డుపైకి శశిధర్‌రెడ్డిని పిల్చుకుని వచ్చి ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు.

నేడు కబడ్డీ ఫైనల్ పోటీలు

- రసవత్తరంగా సాగిన ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు



హోరాహోరీగా తలపడుతున్న తమిళనాడు-హర్యానా జట్లు

రాజంపేట, జనవరి 31: నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. బుధవారం ప్రీక్వార్టర్స్ ఫైనల్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గురువారం ఉదయం 10 గంటలకు ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రీక్వార్టర్ ఫైనల్ పోటీల్లో చత్తీస్‌ఘడ్-వెస్ట్‌బెంగాల్ తలపడగా 41 పాయింట్లతో చత్తీస్‌ఘడ్ విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్-హిమాచల్‌ప్రదేశ్ జట్లు తలపడగా ఉత్తరప్రదేశ్ జట్టు 12 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. తమిళనాడు-హర్యానా జట్లు తలపడగా తమిళనాడు జట్టు 16 పాయింట్లతో విజయం సాధించింది. ఢిల్లీ-తెలంగాణా జట్లు తలపడగా ఢిల్లీ 22 పాయింట్లు తేడాతో విజయం సాధించారు. రాజస్థాన్-బిహార్ జట్లు తలపడగా రాజస్థాన్ జట్టు 7 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. పంజాబ్-ఉత్తరాఖండ్ జట్లు తలపడగా పంజాబ్ 4 పాయింట్లతో విజయం సాధించింది. కేరళ-మహారాష్ట్రల మధ్య పోటీపడగా మహారాష్ట్ర 32 పాయింట్లతో విజయం సాధించింది.

జగన్ ప్రభుత్వంలో ట్రిపుల్‌ఐటీల్లో ఫీజులు పెంపు

కడప, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ వైఎస్‌కు మానసపుత్రిక. ఆయన ఆలోచన నుంచి జాలువారింది. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో 2008లో ప్రారంభించారు. సమైక్యాంధ్రలో ఇడుపులపాయ, నూజివీడు, బాసరలో ఏర్పాటు చేశారు. రాష్ట్రం విడిపోయాక తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలు ఏర్పాటయ్యాయి. ట్రిపుల్‌ఐటీలో సీటు లభించి ఎక్కువ శాతం మంది విద్యార్థినీ విద్యార్థులు పేద కుటుంబాలకు చెందిన వారే. అందువల్ల నామినల్‌గా ఫీజులు నిర్ణయించారు. ఆ ఫీజులను ఫీజురియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల రూపంలో ప్రభుత్వాలు చెల్లిస్తూ వచ్చాయి. జగన్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ట్రిపుల్‌ఐటీలకు మరింత వైభవం వస్తుందని ఆశపడ్డారు. ట్రిపుల్‌ఐటీల్లో ఎన్నో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. రెగ్యులర్ అధ్యాపకులను ఇప్పటికీ నియమించుకోలేకపోతోంది. ఈ క్రమంలో 2020-21లో పీయూసీకి గతంలో రూ.36వేల ఫీజు ఉండగా.. రూ.9వేలు పెంచి రూ.45వేలకు పెంచింది. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు గతంలో రూ.40వేలు ఉండగా, 2020-21లో రూ.50వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో వేలాది మంది పేద విద్యార్థులకు మరింత ఫీజుల రూపంలో భారంపడింది.

పెంచిన ఫీజులను చెల్లించలేం

- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ధర్నా
- డైరెక్టర్ గుప్త జోక్యంతో విరమణ



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

వేంపల్లె, జనవరి 31: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ట్రిపుల్‌ఐటీల్లో పెంచిన ఫీజులను చెల్లించలేమని విద్యార్థినీ విద్యార్థులు ధర్నాకు దిగారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో బుధవారం సాయంత్రం విద్యార్థినీ విద్యార్థులు ఒకటవ అకడమిక్ బ్లాక్ వద్ద బైటాయించి నిరసన తెలిపారు. నోటిఫికేషన్ సమయంలో నిర్ణయించిన మేరకే ఫీజులు చెల్లిస్తాం.. మధ్యలో పెంచితే ఎలా అంటూ అధికారుల ముందు వాపోయారు. సుమారు గంటపాటు విద్యార్థినీ విద్యార్థులు ఆందోళన చేపట్టగా డైరెక్టర్ కుమారస్వామి హుటాహుటిన డైరెక్టర్ కుమారస్వామి గుప్త అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. వెంటనే లేవాలని కంప్యూటర్ ల్యాబ్‌లో చర్చించి సమస్యకు పరిష్కరించుకుందామని నచ్చజెప్పడంతో అక్కడ విద్యార్థులతో సమావేశమయ్యారు. విషయాన్ని వైస్‌చాన్సిలర్, రిజిస్ట్రార్‌కు ఫోన్ ద్వారా డైరెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్‌ను కళాశాలలో చెల్లించండి అని కోరారు. ప్రభుత్వం పెంచిన మేరకు సకాలంలో విద్యాదీవెన, వసతి దీవెన ఇవ్వడం లేదని విద్యార్థులు తెలిపారు. ఉన్నతాధికారులకు తెలియజేశామని వారంలోపు పరిష్కరిస్తామని.. పెంచిన ఫీజుల భారం లేకుండా చూస్తామని డైరెక్టర్ విద్యార్థులకు హామీ ఇవ్వడంతో వారు తాత్కాలికంగా నిరసన విరమించారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు కౌన్సిలర్ల అసమ్మతి సెగ

- మీడియాను అనుమతించకుండా కౌన్సిల్ సమావేశం
- సమావేశానికి అనుమతించకపోవడంతో విలేకరుల ధర్నా
- అనుమతించవద్దని తానే చెప్పినట్లు ఎమ్మెల్యే వెల్లడి
- పాలకమండలి అధికారాల్లో రాచమల్లు జోక్యం రాజ్యాంగ విరుద్ధం

ప్రొద్దుటూరు, జనవరి 31: ప్రొద్దుటూరు వైసీపీలో అసమ్మతి వర్గం రోజురోజుకు బలప డుతోంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎక్కడ ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం కౌన్సిల్లర్లు తమ అసమ్మతిని మీడియా సాక్షిగా బహిరంగంగా వ్యక్తపరుస్తారో అని మున్సిపల్ పాలక మండలి, ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిలు ఆందోళనకు గురయ్యారు. ఆఖరికి అసమ్మతి కౌన్సిల్లర్లను కౌన్సిల్ సమావేశాల్లో నేరుగా ఎదుర్కోలేని దుస్థితి ఏర్పడింది. అసమ్మతి కౌన్సిల్లర్ల వాదనలు ప్రజల్లోకి వెళ్లకుండా ఉండేందుకు మీడియాను సమావేశానికి అను మతించకుండా అప్రాజాస్వామిక నిర్ణయం తీసుకున్నారు.

ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి కోడ్ వస్తే కౌన్సిల్ సమావేశాలు పెట్టుకోవడం కుదరదని భావించి బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. ఇది ఈప్రభుత్వంలో ఆఖరి సమావేశం అవుతందని భావించి.. సమావేశంలో అస మ్మతి బయటికి వ్యక్తం కాకుండా వుండేందుకు.. ఎన్నికల ముందు ఈ అసమ్మతి వెల్లడయితే ఎమ్మెల్యే టిక్కెటుకు ఇబ్బందులు ఎదురవుతాయని.. కౌన్సిల్ సమావేశానికి మీడి యాను అనుమతించపోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. మీడియా ప్రతినిధులను సమావేశానికి అనుమతించక పోవడంతో కార్యాలయం బయట గేటు వద్ద బైఠా యించి నిరసన తెలిపారు. మీడియా లేకుండా రహస్య కౌన్సిల్ సమావేశాలు నిర్వహిం చటంపై మీడియా ప్రతినిధులు విమర్శించారు.

మీడియా లేకుండా సమావేశాలు నిర్వహించటంపై కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు వ్యతిరేకవర్గం మున్సిపల్ కౌన్సిల్లర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్, మునీర్, మహ్మద్‌గౌస్‌లు సమావేశంలో ఛైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. ఇందుకు ఛైర్‌పర్సన్ సమాధానం చెప్పలేదని.. రెండవ వైస్‌ఛైర్మెన్ బంగారు మునిరెడ్డి విలేకరులను అనుమ తించాలా వద్ద అనే అధికారం ఛైర్‌పర్సన్‌కు వుంటుందని సభలో జవాబు చెప్పినట్లు అసమ్మతి కౌన్సిల్లర్లు తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి పనులు, అధికారుల నిర్లక్ష్యం, పాలకమండలి వైఫల్యాలను సమావేశంలో ప్రశ్నిస్తే మీడియా ప్రచారం చేస్తుందని భావించి.. అసమ్మతి గొంతుకలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయడానికి ఎమ్మెల్యే ఈ పాచికలు వేశారని.. అందువల్ల సమావేశాన్ని బహి ష్కరించి.. సమావేశంలో ఏం మాట్లాడాలనుకున్నారో విలేకరుల ఎదుట బహిరంగంగా వెల్లడించారు. టౌన్‌ప్లానింగ్ ఏపీపీ అవినీతి అక్రమాలపై, పట్టణంలో విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ కట్టడాలపై ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కూడా ప్లాను పర్మిషన్లు ఇచ్చి లక్షల రూపాయలు లంచాలు తీసుకున్నట్లు ఆరోపించారు. వార్డుల్లో అభివృద్ధి పనులు పాగటం లేదని ఆరోపించారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకరుల ఆందోళన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అక్కడకు వచ్చారు. తానే మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మీడియాను అనుమతించ వద్దని అధికారులకు తెలిపినట్లు బహి రంగంగా వెల్లడించారు. కొందరు వైసీపీ కౌన్సిలర్లు కావాలనే సమావేశంలో అల్లరి చేయ డానికి ప్రయత్నిస్తారని.. మీడియా వుంటే మరింత రెచ్చిపోతారని.. మీడియా లేకుంటే గొడవలను నివారించవచ్చని తెలిపారు. దీన్నిబట్టి ఆయన తనపై ఉన్న అసమ్మతిని కౌన్సిలర్లు సమావేశంలో వ్యక్తం చేస్తారని.. పాలక మండలి వైఫల్యాలను ప్రశ్నిస్తారని.. ఇది తన టిక్కెటుపై ప్రభావం పడుతుందని ఎమ్మెల్యే భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడవుతోంది. అసమ్మతి కౌన్సిల్లర్ల వాదనలను అల్లరిగా కించపరచడం వారిని అవమానించడంగా భావిస్తున్నారు. ఇక రాజ్యాంగం ప్రకారం మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్ అధికారాలను ఎమ్మెల్యే కాలరాశారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి విలేకరుల ధర్నా వద్ద మాట్లాడుతున్న అసమ్మతి కౌన్సిలర్లు.. మీడియా ప్రతినిధులను మునిసిపల్ గేటు వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

ఉమ్మడి కడప జిల్లాలోని 59 మంది తహసీల్దార్ల బదిలీ

కడప (కలెక్టరేట్) జనవరి 31 : సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జోన్-4 పరిధిలోని ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 59 మంది తహసీల్దార్లను ఇతర జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే ఇతర జిల్లాల నుంచి 59 మంది తహసీల్దార్లను ఇక్కడికి బదిలీ చేసింది. ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనరు బదిలీ కానున్న తహసీల్దార్ల జాబితాను బుధవారం ప్రకటించారు. మూడేళ్లు పైబడిన వారందరూ బదిలీ కానున్నారు. వీరిని జోన్ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2024లో పదవీ విరమణ కానున్న నలుగురితో పాటు మూడేళ్లలోపు సర్వీసు ఉన్న ఇద్దరిని ఎన్నికల కమిషన్ బదిలీల్లో మినహాయింపు ఇచ్చింది. వారు ఎన్నికల విధులకు దూరంగా ఉండనున్నారు.

పెండింగ్ బిల్లుల మంజూరెప్పుడు ..?

- జగనన్నా... ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేదెలా...
- నీటి వసతి లేక లబ్ధిదారులకు అగచాట్లు
- రోడ్లు సైతం లేని వైనం
- ముందుకు సాగని నిర్మాణాలు
- పట్టించుకోని జిల్లా అధికారులు



జగనన్న కాలనీలో నీళ్లు లేక ఆగిపోయిన నిర్మాణాలు

జమ్మలమడుగు, జనవరి 31: జమ్మలమడుగు అంబవరం పాలిటెక్నిక్ కళాశాల పక్కన జగనన్న కాలనీ లబ్ధిదారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో మూడు ఫేస్‌లకు సంబంధించి సుమారు మూడు వేల గృహాలకు వెంచర్లు వేశారు. ఫేస్-1లో ఇప్పటి వరకు పది మంది ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉన్నారు. మిగతా ప్లాట్లలో వివిధ దశల్లో నిర్మాణాలు జరిగాయి. ఎక్కువ శాతం ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. ఫేస్-1లో 354 నంబరు నుంచి 1700 నంబరు వరకు నీళ్లు లేక నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక ఫేస్-2, 3లలో ఎక్కడా నీళ్లు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 354 నంబరు నుంచి ట్యాంకులు పూర్తిగా ఎండిపోయి చుక్క నీరు కూడా లేక లబ్ధిదారులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. జగనన్న కాలనీలో అన్నీ సమస్యలే ఉన్నాయని వాపోతున్నారు.

జమ్మలమడుగు పట్టణం నుంచి ఇంటి నిర్మాణం కొరకు సామగ్రి తెచ్చుకోవాలన్నా ఇబ్బందికరంగా మారింది. సిమెంటు, ఇటుకలు, కడ్డీలు తెచ్చుకుని ఇంటి నిర్మాణం చేపట్టడానికి ఇంటిస్థలం వద్ద నిలిపితే.. అదే రోజు రాత్రే చోరీకి గురవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక నీళ్లు తెచ్చుకోవాలంటే ఒక్క ట్యాంకరుకు రూ.1100లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇంటి వద్దనే రోజంతా ట్యాంకు పెట్టుకోవాలంటే అదనంగా మరో రూ.300 మొత్తం రూ.1400-రూ.1500 ఒక ట్యాంకు నీళ్లకే ఖర్చు అవుతుందంటున్నారు. ఇసుక జగనన్న కాలనీ పేరుతో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారని, కాలనీలో లబ్ధిదారులకు ఇసుక కరువైపోతోందని వాపోతున్నారు. ఇక అలంకారప్రాయంగా కరెంటు స్తంభాలు ఉన్నాయని, కొన్నిచోట్ల మాత్ర మే మీటర్లు బిగించారని, లబ్ధిదారులు డబ్బులు చెల్లించి మీటర్ల కోసం ఎదురుచూస్తున్నట్లు వాపోతున్నారు. కాలనీలో ఏమాత్రం ఎక్కడ రోడ్లు లేవని, ప్రధాన రోడ్డుకే సిమెంటు రోడ్డు లేదని తెలిపారు. ప్రధాన రోడ్డులో పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీగోడ పక్కన రోడ్డుపై కరెంటు స్తంభం దారికి అడ్డంగా ఉందని, దానిపక్కనే బోరు ఉందని, దారికి అడ్డంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదంటున్నారు.



జగనన్న కాలనీలో మట్టి రోడ్డే గతి

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీకి అనేక సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులు, జిల్లా అధికారులు, లబ్ధిదారులు అడుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అయితే పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వడం లేదని ఇలా ఉంటే ఇళ్ల నిర్మాణాలు ఎలా ముందుకు సాగుతాయని లబ్ధిదారులు వాపోతున్నారు. డబ్బులు లేక పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి అప్పులు చేసి బిల్లులు వస్తాయని ఎదురు చూస్తున్నా రావడం లేదని, ప్రభుత్వం జగనన్న ఇళ్ల పేరుతో లబ్ధిదారులకు అప్పులు తప్ప ఏమాత్రం లాభం లేదని సమస్యలే పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యలకు సంబంధించి అధికారులు స్థానిక మున్సిపాలిటీ ఫండ్స్‌లో సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పినట్లుగా తెలుస్తోంది. అయితే జగనన్న కాలనీలో ప్రస్తుతం ఒక బోరు మాత్రమే పనిచేస్తోందని, అది కూడా ఎప్పుడు నిలిచిపోతుందో అప్పుడు కాలనీ అంతా నీటి ఎద్దడి ఏర్పడుతుందని వాపోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు చేతులెత్తేసినట్లుగా తెలుస్తోంది. అందులో హౌసింగ్ అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.



కాలనీలో నీళ్లులేక ఎండిపోతున్న ట్యాంకులు

ఈ సమస్యకు సంబంధించి హౌసింగ్ ఏఈ ఓబులేసును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా జగనన్న కాలనీలో నిర్మాణాలు జరగడం లేదని, పెండింగ్ బిల్లులు రావడంలేదని, నీళ్లు కూడా లేక ఒక బోరు మాత్రమే పనిచేస్తోందని నీళ్ల బోర్లకు నిధులు లేక మున్సిపాలిటీ అధికారులకు జిల్లా అధికారులు ఆదేశించినా మున్సిపల్ అధికారులు నిధులు లేవని జగనన్న కాలనీ సమస్యలు వదిలేసినట్లుగా తెలిపారు.

మీ సేవలు చిరస్మరణీయం

ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్పీ సిద్ధార్థ కౌశల్



పోలీసు కుటుంబాలకు జ్ఞాపికలను అందిస్తున్న ఎస్పీ

కడప (క్రైం), జనవరి 31 : దాదాపు 35 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల పాటు అంకితభావంతో అందించిన మీ సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పదవీ విరమణ పొందిన కమాండ్ కంట్రోల్ ఎస్ఐ కె.ఓబయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఓబుల్‌రెడ్డిలను ఆయన సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన సమయంలో అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వహించడం కష్టమైన పని అన్నారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కోరారు. పదవీ విరమణ తరువాత కూడా మీరు పోలీసు కుటుంబ సభ్యులేనని, ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్‌నాయక్, శివరాముడు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబసభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

రెండోరోజు నిడుజువ్విలో సినిమా షూటింగ్

భారీగా తరలివచ్చిన అభిమానులు



షూటింగ్ జరుగుతున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జనవరి 31: తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా షూటింగ్ రెండో రోజైన బుధవారం కూడా నిడుజువ్వి గనుల్లో జరిగింది. సినిమా హీరో రజనీకాంత్ కోసం వేసిన ప్రత్యేక సెట్స్ ఆయన పాల్గొన్నారు. సాయంత్ర 5.30 గంటల వరకు జరిగిన షూటింగ్‌లో ఆయన వివిధ సన్నివేశాల్లో పాల్గొన్నారు. అనంతరం నాపరాయిగని యజమాని ఎస్.మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆయనకు గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు హీరోయిన్ రిత్వికాసింగ్, విలన్స్ కూడా పాల్గొన్నారు. రెండురోజులపాటు ఆయన ఇక్కడే షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు ఆయన సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన చిన్న

రాజంపేటటౌన్, జనవరి 31: రాజంపేట పట్టణంలోని శివాలయం సమీపంలో చిన్న (19) అనే యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం పట్టణంలోని కడప-తిరుపతి ప్రధాన రహదారిలో శివాలయం వద్ద బైకుపై వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని చూసి భయాందోళనకు గురై అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై అధిక రక్తస్రావం కావడంతో యువకుడు చిన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతను కర్నూలు జిల్లా బాటతాండా గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. జీవనోపాధికి వారి తల్లిదండ్రులతో కలిసి రాజంపేట శివారులోని ఎన్.టి.ఆర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీపనులు చేసుకుంటూ జీవన సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ సంఘటన తెలుసుకున్న పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్థానికంగా సీసీ ఫుటేజీల ద్వారా పూర్వాపరాలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



షేక్ అస్లాం

ఖాజీపేట, జనవరి 31: మండలంలోని కొమ్మలూరు గ్రామానికి చెందిన ఖాదర్‌బాష కుమారుడు షేక్ అస్లాం బుధవారం అదృశ్యమయ్యాడు. ఖాజీపేట స్కూలులో 10వ తరగతి చదువుతూ ప్రభుత్వ హాస్టల్‌లో ఉండేవాడు. బుధవారం ఉదయం టిఫిన్ తిని స్కూలుకు వెళుతున్నాని చెప్పి స్కూల్‌కు రాకపోవడంతో స్కూల్ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థి తల్లిదండ్రులు అంతా గాలించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి ఎక్కడైనా కనిపిస్తే 9121100623 అనే నంబరుకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కడప (క్రైం), జనవరి 31 : కడప నగరం సాయిపేటలోని ఏ-1 నగర్‌లో గత నెల 27న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై కత్తితో దాడి చేసిన కేసులో షేక్ అర్షద్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ తబరేజ్ తెలిపారు. సాయిపేటలోని ఏ-1నగర్‌కు చెందిన షేక్ అర్షద్ అల్లరిగా తిరుగుతూ అందరినీ బెదిరిస్తూ ఉండేవాడన్నారు. గత నెల 24న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి ఈ మేరకు రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు



బార్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ సుభాషిణి

బద్వేలు టౌన్, జనవరి 31 : బద్వేలులో ఎక్సైజ్ సీఐ సుభాషిణి తన సిబ్బందితో కలిసి బుధవారం రెండు బార్ అండ్ రెస్టారెంట్లను తనిఖీ చేశారు. 'కోడి కూతకు ముందే కిక్' అని ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్తకు ఎక్సైజ్ అధికారుల్లో చలనం వచ్చింది. మద్యం శాతాన్ని గుర్తించి తనిఖీలు చేశారు. సమయపాలన లేకుండా బార్ అండ్ రెస్టారెంట్లు తెరిచి మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవని, సమయపాలన పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.

యువకుడి అరెస్టు

60 మద్యం బాటిళ్ల స్వాధీనం



మద్యం బాటళ్లతో నిందితుడు

కడప (క్రైం), జనవరి 31 : కడప నగరం బిల్డప్‌సర్కిల్ వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ రాజా తెలిపారు. కడపకు చెందిన యువకుడు మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో కడప డీఎస్పీ షరీఫ్ ఆదేశాల మేరకు అతన్ని అరెస్టు చేసి అతని వద్ద నుండి 60 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

వల్లూరులో 48 బాటిళ్లు...

వల్లూరు, జనవరి 31 : మండల పరిధిలోని దిగువపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న విషయం తెలవడంతో స్థానిక ఎస్ఐ వెంకటరాముడు తన సిబ్బందితో కలిసి దాడి చేసి 48 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు అక్రమంగా మద్యం అమ్ముతున్నారని తెలియడంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి 48 మద్యం బాటళ్లతో పాటు సంజీవ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మదనపల్లె టౌన్, జనవరి 31: భర్తతో గొడవ పడి ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మదన పల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీకి చెందిన విద్యావాణి(36) భర్త సోమశేఖర్ ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె టీచర్స్ కాలనీకి చెందిన చంద్రశేఖర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. చంద్రశేఖర్ మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు వుండగా, విద్యావాణికి ఒక కొడుకు వున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం విద్యావాణి తన భర్త చంద్రశేఖర్‌తో గొడవ పడింది. పిల్లలు తాము ఒకే ఇంట్లో ఉండలేమని, మిద్దెపైన ఇంకో గది నిర్మించాలని వాగ్వాదం చేసింది. దీనికి సమ్మతించని చంద్రశేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆగ్రహించిన విద్యా వాణి ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది.

గమనించిన కుటుంబీకులు చంద్రశేఖర్‌కు సమాచారం అందించడంతో ఆయన వచ్చి ఉరి నుంచి విద్యావాణిని తప్పించి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెందిందని చెప్పారు. తాలూకా ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటు తుపాకీతో దంపతులపై దాడి



గాయపడిన రెడ్డిశేఖర్‌రెడ్డి

కురబలకోట, జనవరి 31: నాటు తుపాకీతో దంపతులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు క్రాస్ పంచాయతీ దిన్నిమీదపల్లెకు చెంది న దంపతులు జి.రెడ్డిశేఖర్‌రెడ్డి (55), సరస్వతమ్మ (50)లు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు గ్రామ సమీపంలో పొలంలో పంటలు సాగు చేస్తున్నారు. కాగా బద్ధిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి అలియాస్ మల్‌రెడ్డి వీరి పొలం పక్కనే పొలంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. కాగా పొలంలో పంట విషయమై ఇరువురు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన మల్లికార్జునరెడ్డి తన వద్ద నున్న నాటు తుపాకీతో దాడి చేసి దంపతులను గాయపరిచారు. గాయపడ్డ వారిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంక స్థలంలో అక్రమ కట్టడాలు

- రూ.కోట్ల విలువ చేసే స్థలానికి ఎసరు ● అడ్డుకున్న రెవెన్యూశాఖాధికారులు



వంకపొరంబోకు భూమి స్థలంలో అక్రమంగా నిర్మించిన కంచె

రైల్వేకోడూరు, జనవరి 31: ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు బడాబాబులు, నాయకులు గద్దల్లా వాలిపోయి కబ్జా చేసి నిర్మాణాలు చేసేస్తున్నారు. రైల్వే కోడూరు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ పరిధిలోని గంగరాజపురం ప్రధానదారికి పక్కనే సర్వే నెంబరు 38-1లో 50 సెంట్ల భూమని ఆక్రమించుకుని దర్జాగా ఇంటి నిర్మాణాలు సాగిస్తున్నారని రాఘవరాజపురం వీఆర్వో నిరంజన్ తన సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. తమకు పట్టాలు ఉన్నాయని కబ్జాదారులు చెప్పడంతో వివాదం చోటుచేసుకుంది. వంకపరంబోకు స్థలంలో ఎవరూ కట్టడాలు చేయరాదని రెవెన్యూశాఖాధికారులు చెప్పడంతో పనులు ఆపేశారు. ఇదిలా ఉంటే సర్వే నెంబరు 38-1లో 2.14 ఎకరాల భూమి ఉంది. ఏడాదిన్నర క్రితం స్థానిక ప్రజల వినతి మేరకు రెవెన్యూ శాఖాధికారులు రీసర్వే చేయించారు. దీంతో సర్వే నెంబరు 178గా మారింది. వంక పొరంబోకు స్థలం మొత్తం మీద 50 సెంట్లు ఉందని, మిగిలినవి రైతులకు పట్టాలు మంజూరు చేశారని రైతులు తెలిపారు. ఈ స్థలం కొంత మేరకు రోడ్లు భవనాల శాఖ పరిధిలోకి, మరికొంత ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందని రెవెన్యూ శాఖాధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ స్థలం ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో రూ.5 కోట్ల విలువ చేస్తుందని అంచనా. దీనిపై అందరి కన్నుపడింది. కొందరు ఇందులో కొంత స్థలాన్ని విక్రయాలు చేసుకున్నారని ప్రచారం సాగింది. పలుసార్లు ఈ స్థలంపై వివాదాలు చోటుచేసుకున్నాయి. కొందరు బడా వ్యక్తులు ప్లాట్లు వేసి విక్రయాలు చేయాలని చూశారు. స్థానిక ప్రజలు అడ్డుకోవడంతో వెనక్కు తగ్గారు. మళ్లీ ఇదే స్థలంలో కట్టడాలు ప్రారంభించడంతో వివాదాలకు దారి తీస్తోంది. ఎన్నికల సమయంలో పెద్ద ఖద్దరు బాబులు ఏమి కాదు ఏమైనా చేసుకోండి అని సలహాలు ఇవ్వడంతో కొందరు వంక పొరంబోకు స్థలానికి స్కెచ్ వేశారు. నకిలీపత్రాలు చూపి కట్టడాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒకరు అయితే ఏకంగా షెడ్డు నిర్మాణం చేసి ఉన్నారు. దీనిని కూడా తొలగించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. సర్వే నెంబరు వేరే వేసుకుని కట్టడాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంక పొరంబోకు స్థలాలను ప్రభుత్వ అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వంకపరంబోకు స్థలాలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని రైల్వేకోడూరు డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి తెలిపారు. రాఘవరాజపురం పంచాయతీలోని గంగరాజపురంలో వంక పొరంబోకు స్థలంలో ఇంటి నిర్మాణాలు సాగుతున్నాయని ఫిర్యాదు రావడంతో వీఆర్వో వెళ్లి అడ్డుకుని పనులు నిలుపు చేయించారన్నారు. ఈ స్థలంపై పలువురు కోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో రెవెన్యూశాఖ కూడా కోర్టులో రీకౌంటర్ దాఖలు చేసిందన్నారు. ఇరిగేషన్ శాఖ వారికి సంబంధించిన భూమి కాబట్టి వారు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏదిఏమైనా వంకపొరంబోకు స్థలాలను ఆక్రమించరాదు, కట్టడాలు చేయరాదు అని చట్టంలో ఉందని తెలిపారు.



వంకపొరంబోకు భూమిలో ఇంటి నిర్మాణాలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రాణాలు నిలిపిన హెల్మెట్



చిన్నరంగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, బైకు

పులివెందుల రూరల్, జనవరి 31: మున్సిపల్ పరిధిలోని చిన్నరంగాపురం సమీపంలో బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలను హెల్మెట్ కాపాడింది. స్థానిక ప్రజలు, ద్విచక్రవాహనదారుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల నుంచి లింగాల వైపునకు బైకులో ఓ వ్యక్తి వెళ్తుండగా లింగాల వైపు నుంచి పులివెందులకు ఓ కారు వస్తోంది. ఇంతలో పులివెందుల వైపు నుంచి లింగాలకు వెళ్తున్న ఓ ఆటో బైకును ఓవర్ టేక్ చేయబోయింది. రోడ్డు డబుల్ రోడ్డు కావడంతో ఓవర్‌టేక్ సమయంలో ఎక్కువ గ్యాప్ లేక ఎదురుగా వస్తున్న కారును ఆటో స్వల్పంగా ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన కారు ఆటో వెనుక వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనవారుడు ఎగిరిపడి కారు అద్దంపై పడ్డాడు. ద్విచక్రవాహనదారుడి కాళ్లకు, కుడిచేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొట్టిన ఆటో అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోవడంతో ఎవరు గుర్తించలేకపోయారు. ఈ ప్రమాదంలో కారు ముందుబాగం, అద్దం దెబ్బతినగా ద్విచక్ర వాహనం ముందు భాగం అంతా నుజ్జునుజ్జు అయింది. 108కు ఫోన్ చేసి ద్విచక్రవాహనదారున్ని పులివెందుల ఆసుపత్రికి తరలించారు. అయితే ద్విచక్రవాహనదారుడుకు హెల్మెట్ ధరించకపోయింటే ప్రాణాలు పోయేవని అక్కడి సంఘటనతో స్పష్టమవుతోందని ప్రజలు చర్చించుకున్నారు.

వీఎన్‌పల్లె ఎస్‌ఐగా వెంకటరెడ్డి



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ

వీరపునాయునిపల్లె, జనవరి 31: వీరపునాయునిపల్లె మండల ఎస్‌ఐగా కె.వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కుళాయప్ప బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వెంకటరెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో డైరెక్టర్

వేంపల్లె, జనవరి 31: భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ట్రిపుల్‌ఐటీలో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఈ పోటీలో పీయూసీ- 1,2 తెలుగు, ఇంగ్లీష్ మీడియంలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ చూపిన ఆయా విభాగాల విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందించినట్లు తెలిపారు. అనంతరం డైరెక్టర్ కుమారస్వామి గుప్తను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్, కోఆర్డినేటర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వృద్ధురాలు

కడప (కల్చరల్) జనవరి 31: మహావీర్ సర్కిల్ వద్ద గల సుబ్రమణ్యం స్వామి ఆలయం వద్ద దీనావస్థలో పడిఉన్న బద్వేల్ పట్టణం లక్ష్మీపాలెంకు చెందిన సుబ్బమ్మ (80)ను బుధవారం విద్యార్థినులు ఇందిరానగర్‌లోని పద్మావతి-వేంకటేశ్వర వృద్ధాశ్రమానికి చేర్చారు. కాగా ఆ వృద్ధురాలు 'మా ఊరు లక్ష్మీపాలెం... అక్కడి రామాలయం పక్కన పూలచెట్టు... ఆ పక్కనే మా ఇల్లు' అని తన వద్ద ఉన్న డబ్బు ఎవరో లాక్కెళ్లారని చెబుతోందని, తలకు గాయమై ఉందని, ఆమె బంధువులు వివరాలకు 9550874906 అనే నెంబర్‌ను సంప్రదించాలని వృద్ధాశ్రమం ప్రతినిధి తెలిపారు.

రైతులు తమ వివరాలు తెలియజేయాలి

కడప(రూరల్) జనవరి 31 :గుంటూరు జిల్లా దుగ్గిరాల మండల కేంద్రంలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజి ప్రైవేట్ లిమిటెడ్‌లో జనవవరి 19న అగ్ని ప్రమాదానికి గురై అందులో నిల్వ ఉంచిన పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అగ్నికి ఆహుతైన మేరకు పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తలు నిల్వ ఉంచుకున్న కడప జిల్లా రైతులు తమ వివరాలను తెలియజేయాలని కడప వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు ఆజాద్ వలి పేర్కొన్నారు. బాండు, పట్టాదారు పాస్ పుస్తకము, బ్యాంకు లోను, బీమా నకలు కాపీ వివరాలతో ధరఖాస్తును దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీకి కానీ కార్యదర్శికి స్వయంగా కానీ లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా కానీ వారం రోజులలోపు సమర్పించాలన్నారు. వివరాలకు 91823 61223, 9182361217, 522330కు సంప్రదించాలన్నారు.

మేనిఫెస్టో అమలు చేయడంలో వైసీపీ విఫలం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి



టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 31 : మేనిఫెస్టో అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి ఆరోపించారు. వైసీపీ నేతలు 90 శాతం మేనిఫెస్టో అమలు చేశామని గొప్పలు చెపుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బుధవారం కడప నగరం 27వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ చదువుకున్న పిల్లలకు అమ్మఒడి ఇస్తామని చెప్పి కుటుంబంలో ఒకరికే ఇవ్వడంతో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఎలా విద్యనభ్యసిస్తారని ఆమె ప్రశ్నించారు. 90 శాతం మేనిఫెస్టో అమలు చేసినట్లు జగన్ చెప్ప డం పచ్చి అబద్ధమన్నారు. రైతు భరోసా, అందరికీ ఇళ్లు, మద్యనిషేధం, ఫీజు రీయింబర్స్ మెంటు లాంటి నవరత్నాల అమలులో జగన్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. పేదల ఆర్థిక ఎదుగుదలకు చేయూతనిస్తామన్నారు. మాసాపేట శివ, కొమ్మలపాటి సుబ్బరాయుడు, ఎస్.రవిశంకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, సునీత, పార్వతి, రహ్మంతుల్లా, అల్లాబకాష్, స్థానిక మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: కడప నగరం 43వ డివిజన్ కాగితాలపెంటలో మాధవ్ ఆధ్వర్యంలో తొగ ట వీరక్షత్రియ కులస్థులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిలానీ, జమీల్, శివకొండారెడ్డి, అప్జల్, యూనుస్, క్రి ష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్ధన రెడ్డి, సునీత, పార్వతి టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మీ భవిష్యత్తుకు భరోసా టీడీపీనే: పుత్తా



పార్టీలో చేరిన వారితో పుత్తా, జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి

వల్లూరు, జనవరి 31 : మీ భవిష్యత్తుకు భరోసా టీడీపీనేనని ఆ పార్టీ ఉ పాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడి అన్నారు. బుధవారం మండలంలోని గోటూరు, వెంకటేశాపురం గ్రామాల్లో మీ భవిష్యత్తుబాబు గ్యారంటీ కార్యక్రమాన్ని పుత్తాతో పాటు, జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ వస్తే లబ్ధిదారులకు లభించే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం పుత్తా మాట్లాడు తూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కనిపించడంలేదన్నారు. పుత్తా నరసింహారెడ్డి గ్రామంలోకి రాగానే గోటూరు, ఎస్సీ కాలనీ ప్రజలు బాణసంచా పేలుస్తూ బ్యాండుమేళాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, గోటూరు మాజీ స ర్పంచ్ రామసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, సునీల్, వెల్డర్ గంగాధర్, శ్రీనివాసరెడ్డిలతో పాటు చెన్నూరు, వల్లూరు, కమలాపురానికి చెందిన టీడీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుత్తా ఆధ్వర్యంలో 30 కుటుంబాలు చేరిక

భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా మండల పరిధిలోని వెంకటేశాపురానికి కమలాపురం ఇన్‌చార్జ్ పుత్తా వెళ్లినప్పుడు పుత్తా ఆధ్వర్యంలో దాదాపు 30 కుటుంబాలు పుత్తా టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికలో పొన్నోలు వేణుగోపాలరెడ్డి, మల్లికార్జున, పుత్తా సునీల్, గోర్ల వంశి, మహేష్, జగదీష్, బండెయ్య, కిట్టయ్య, దాసరి శ్రీనివాసులు, దాసరి సుధాకర్‌తో పాటు 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. పుత్తా వెంట స్థానిక నేతలు రమణారెడ్డి, రామసుబ్బారెడ్డి , వెంకటసుబ్బయ్య సునీల్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డితో పాటు మండలంలోని పుత్తా అనుచరులు, టీడీపీ అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు వెంకటేశాపురం గ్రామానికి చేరిన వెంటనే పుత్తాకు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

టీడీపీని గెలిపించి సూపర్ సిక్స్ అందుకోండి



చెన్నూరులో భవిష్యత్తు గ్యారంటీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చెన్నూరు, జనవరి 31 : ప్రజలు రాబోవు ఎన్నికల్లో టీడీ పీని గెలిపించి సూపర్ సిక్స్ పథకాలు అందుకోవాలని టీడీపీ మండల అధికార ప్రతినిధి జడ లక్ష్మీనారాయణ, కార్యదర్శి అతికారి విశ్వం అన్నారు. చెన్నూరు కొత్తరోడ్డులోని సరస్వతీనగర్, లక్ష్మీనగర్‌లలో బుధవారం సాయంత్రం బాబుతో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేతలు ఆటోబాబు, కుందేటి క్రిష్ణయ్య, క్రిష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కడప - బెంగళూరు రైలు మార్గం వద్దన్నది వైసీపీ కాదా

● రామచంద్రయ్యను విమర్శించే స్థాయి మేయరుకు లేదు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్



మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 31 : కడప - బెంగళూరు రైలు మార్గం వద్దని లెటర్ ఇచ్చింది వైసీపీ ప్రభుత్వం కాదా అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ ప్రశ్నించారు. బలిజల ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను లేకుండా చేసింది జగన్‌మోహన్‌రెడ్డి అని ఆరోపించారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్యను విమర్శించే స్థాయి మేయరు సురేష్‌బాబుకు లేదని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అబివృద్ధి పేరిట కడప నగరాన్ని వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కమలాపురంలో రవీంద్రనాథరెడ్డిని ఇంటికి పంపడం ఖాయమన్నారు. కడపలో వైసీపీ నేతలు దోచుకో.. దాచుకో కార్యక్రమాన్ని చేపట్టారని ఆరోపించారు. అలాగే బడ్జెట్‌పై చర్చకు రమ్మని ఎమ్మెల్సీ రామచంద్రయ్యకు మేయరు సురేష్‌బాబు సవాల్ చేసిన విషయం గుర్తు చేశారు. మేయరు స్థాయికి ఎమ్మెల్సీ రామచంద్రయ్య అవసరంలేదని ఆ సవాల్‌ను తానే స్వీకరిస్తున్నానని, చర్చకు తాను సిద్ధమని చెప్పారు. స్థలం నువ్వు చెప్పినా, మేం చెప్పమన్నా ఓకే అన్నారు. కడపలో సెంటు భూమి కూడా లేకుండా వైసీపీ నేతలు కబ్జాలు చేశారని, దీంట్లో కమలాపురం ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే మేయరుగా ఉన్నప్పుడు కడపను సింగపూర్ చేస్తామని పుంగనూరు కూడా చేయలేకపోయాడన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. మెగా మోసం: ఏఐవైఎఫ్



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రావిడ సురేష్

కడప (నాగరాజుపేట), జనవరి 31 : మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి ఐదేళ్లుగా నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రావిడ సురేష్ అన్నారు. బుధవారం రారా గ్రంథాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి జగన్ ప్రభుత్వం మెగా డీఎస్సీ వదులుతామని చెప్పి దగా చేస్తోందని ఆగ్రహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మరిచిపోయారని అంతేకాకుండా అప్రెంటీస్ విధానం తీసుకువచ్చి నిరుద్యోగులను నిలువునా మోసం చేశారన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్య, ఉన్నత విద్య ప్రతి ఒక్కరికీ అందాలని పదే పదే చెబుతున్న సీఎం జగన్ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. నాడు నేడు పేర్లతో కోట్ల రూపాయలు అనవసర ఖర్చులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో 2500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని చెప్పి ఊరించి ఇప్పుడు చావుకబురు చల్లగా చెప్పినట్లు 6100 పోస్టులు ఇవ్వడం మెగా మోసం కాదా అని ప్రశ్నించారు. విద్యార్థులు డీఎస్సీ కోసం ఐదేళ్లుగా కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లు, రూముల్లో ఉంటూ వేలకు వేలు ఖర్చు చేసుకుంటు న్నారన్నారు. మెగా మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి నిరుద్యోగులు త్వరలో తగిన గుణపాఠం చెబుతారన్నారు. జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శి దేవరాహుల్, నగర కార్యదర్శి శివ, నాగేంద్ర, ఉపాధ్యక్షుడు నాగార్జున, చైతన్య పాల్గొన్నారు.

శిక్షణ ఫలాలు సమాజంలోకి వెళ్లాలి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 31: శిక్షణలో తెలుసుకున్న విషయాన్ని వలంటీర్లకు వివ రించి తద్వారా సమాజంలోకి తీసుకెళ్లాని ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి తెలిపారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంటు భారత ప్రభుత్వ యువజన, క్రీడల వ్యవహార మంత్రిత్వ శాఖ, వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త ఎన్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై యువతకు అవగాహన కల్పించే దిశగా మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం ము గింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ 1988లో వైరస్‌లు ఉండేవని, వాటిని నియించేందుకు యాంటి వైరస్‌లు వినియోగించేవారని, నేడు సాంకేతికత పెరిగి హ్యాకర్లు పెరిగారన్నారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు సామాజిక మాధ్యమాలు విస్తృతమైన నేపథ్యంలో అప్రమత్తతే ప్రధాన ఆయుధమన్నారు. సైబర్ సెక్యూరిటీ గురించి తోటి అధ్యాపకులకు, వలంటీర్లకు వివరించి చైతన్యం చేయాలన్నారు. అనంతరం ఆర్‌జీఎన్‌ఐ వైడీ సాంకేతిక నిపుణులు సురేంద్రబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ప్రొఫెసరు అనిత, డాక్టర్ వాసు గోవర్ధనరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌వీ రెడ్డి, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, కె.లలిత, రాజగోపాల్‌రెడ్డి, జిల్లాలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.

వృద్ధులకు సేవ చేయడం వరం



బృందా సభ్యులను సన్మానిస్తున్న వృద్ధాశ్రమ అధికారులు

సీకేదిన్నె, జనవరి 31: వృద్ధులకు సేవ చేయడం వరంలాంటిదని వా రిని దైవసంభూతులుగా చూడాలని జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లో ఉన్న బృందా స్ఫూర్తి ఫౌండేషన్ వృద్ధాశ్రమం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు బట్టలు, బెట్‌సీట్లు అందజేశారు. కార్యక్రమంలో వికాస్‌హరికృష్ణ, హిమవర్షిణి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, రవి, పురుషోత్తంరెడ్డి, రెడ్డిలక్ష్మణ్, దామోదరం, రాజశేఖర్‌రెడ్డి, టైలర్ రవి, తాళ్లపాక ఓబులేసు, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

'ఆటోకు నష్టపరిహారం చెల్లించాలి'

కడప (నాగరాజుపేట), జనవరి 31 : జీవనాధారమైన ఆటోను కోల్పో యి నెలలు గడుస్తున్నా నష్టపరిహారం చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, వెంటనే పరిహారం చెల్లించాలని రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తస్లీం, లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని టీకేఎం స్ట్రీట్‌లోని మౌళాలి ఏజెన్సీలో ఆటో కోల్పోయిన టుంబీలకుతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవునకడప రోడ్డు వెడల్పులో భాగంగా డ్రైనేజీ కాల్వ తీయడం ద్వారా గరీబ్ షా స్ట్రీట్‌లోని మూడంతస్థుల భవంతి కూలిపోవడంతో దాని కింద నిలిపిన ఆటో పూర్తిగా ధ్వంసమైనదన్నారు. ఇందుకు నష్టపరిహారం చెల్లించాలని సుమారు ఐదు నెలల నుంచి సంబంధిత యజమానులను, అధికారుల చుట్టూ తిరిగినా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబంపై ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం చెల్లించకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్సీపీ నగర కార్యదర్శివర్గ సభ్యుడు మడగలం ప్రసాద్, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, కరీమున్, చాన్‌బేగం, శోభారాణి, మస్తానీ, జరీనా, సుభాని, హసీనా, ఆదిలక్ష్మి, కాసిం, కాజా, రమేష్, సూరి పాల్గొన్నారు.

'అప్రెంటిస్ విధానాన్ని పునరుద్ధరించడం సరికాదు'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 31 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, అయితే అప్రెంటీస్ విధానాన్ని పున రుద్ధరించనున్నట్లు వస్తున్న వార్తలు సరి కాదని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీటీఎఫ్ అవరావతి రాష్ట్ర నాయకులు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, ఆలీఖాన్, ఈశ్వర్ చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న రెగ్యులర్ వేతనాలకు మొండిచేయి చూపించడం అన్యాయమన్నారు. 13 రోజుల సమ్మెతో అప్రెంటీస్, నోషనల్ ఇంక్రిమెంట్లు అప్రెంటీస్ విధానం రద్దు సాధించుకున్న విషయం వివరించారు.

కడప తహసీల్దారు అనంతపురం బదిలీ

కడప(కలెక్టరేట్) జనవరి 31: ఎన్నికల ప్రక్రియలో భాగంగా కడప తహసీల్దార్ బి.శివరామిరెడ్డిని అనంతపురం జిల్లాకు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2019 ఫిబ్రవరి నెలలో అప్పటి సాధారణ ఎన్నికల్లో భాగంగా కర్నూలు జిల్లా నుంచి కడపకు బదిలీపై వచ్చారు. దాదాపు 5 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం కడప తహసీల్దారుగా విధులు నిర్వహిచారు. 1984వ సంవత్సరంలో మండల వ్యవస్థ ఏ ర్పడింది. ఆనాటి నుంచి నేటి వరకు దాదాపు 25 మంది తహసీల్దార్లు కడపలో పని చేశారు. అయితే కడప చరిత్రలో సుదీర్ఘ కాలం 5 ఏళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న తహసీల్దారుగా శివరామిరెడ్డి నిలిచి పోనున్నారు.

వీధిబాలల విద్యను ప్రోత్సహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) జనవరి 31 : వీధిబాలల విద్యను, అభివృద్ధిని ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని డిఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం నందు వీధి బాలల దినోత్సవాన్ని డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వీధి బాలల కోసం జనవరి 31న అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ ప్రత్యేకతను ఆస్ట్రియన్ స్వచ్ఛంద సంస్థ జుగెండ్ ఐన్ వెల్ట్ నుండి ఉనికిలోకి వచ్చిందన్నారు. ఈ సంస్థ 1997లో స్థాపించబడిందన్నారు. వీధిబాలల అభివృద్ధిని, విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పట్టణ వీధుల్లో 100 మిలియన్ల మంది పిల్లలు పెరుతారని అంచనా వేయబడిందన్నారు. భారత దేశంలో 11 నుంచి 18 మిలియన్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని పిల్లలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చదివిన సంస్థకు పేరుతేవాలన్నారు. ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ వీరయ్య, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషనరీ ఆఫీసర్ చెన్నారెడ్డి, ఎంఈఓ నారాయణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు వితరణ



అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

సీకేదిన్నె, జనవరి 31: చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు నర్రెడ్డి చిన్నగంగిరెడ్డి రూ.50,116 విరాళం అందించారు. ఆలయం పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులు వారి కుటుంబాన్ని సంప్రదించగా వెంటనే స్పందించిపై మొత్తం విరాళంగా అందించారు. కుమారుడు బాలగంగాధర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకులో ఇ-రిజిస్ట్రేషన్ సౌకర్యం

● చైర్‌పర్సన్ ఝాన్సీరాణి



ఇ-రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఝాన్సీరాణి

కడప(రూరల్) జనవరి 31 : రిజిస్ట్రేషన్ కోసం ఇ-రిజిస్ట్రేషన్ చలానా సౌకర్యాన్ని డీసీసీ బ్యాంకులో ఫిబ్రవరి 1 నుంచి కల్పించడం జరిగిందని డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం డీసీసీబీ కార్యాలయంలో ఇ-రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ డీసీసీబీ ఖాతాదారులు మాత్రమే కాకుండా ప్రజలందరు ఇ చలానాను ఉపయోగించుకోవచ్చన్నారు. కట్టవలసిన చలానా మొత్తానికి ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించవలసిన అవసరం లేదన్నారు. డీసీసీ బ్యాంకులో ఎప్పటి నుండో ఇ-స్టాంపింగ్ సౌకర్యం ఉందని ప్రజలు ఎలాంటి ఫీజు లేకుండా బాండ్ పేర్లు డిసిసి బ్యాంకు బ్రాంచ్‌లలో తీసుకుంటున్నారని ఇక నుండి రిజిస్ట్రేషన్ ఫీజు కూడా డీసీసీబీ అన్ని బ్రాంచ్‌లలో తీసుకుంటారన్నారు. ఇప్పటి వరకు కేవలం ఎస్‌బిఐలో మాత్రమే ఈ సౌకర్యం ఉండేదని ఇకపై డీసీసీబీలో కూడా ఉంటుందన్నారు.

వేంపల్లె శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె, జనవరి 31: జనవరి 30న పులివెందుల లయోలా డిగ్రీ కళాశాలలో యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన ఇంటర్ స్కూల్ ఫెస్ట్ -2024లో వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. డ్యాన్స్ మరియు స్పాట్ పెయింటింగ్ నందు మొదటి బహుమతిని సాధించారన్నారు. హేమేంద్రి, మిధున ప్రియ, జస్విత ప్రియ, హర్షిని, షణ్ముఖప్రియలు డ్యాన్స్‌లోను, అలాగే స్పాట్ పెయింటింగ్‌లో రోహిత్ మొదటి బహుమతి సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, డ్యాన్స్ మాస్టర్‌ను, డ్రాయింగ్ మాస్టర్‌ను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అభినందించారు.

జాతీయ స్థాయిలో సేవలందించడం అభినందనీయం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 31 : ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో సేవలందించడం అభినందనీయమని ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కె.శ్రీవాణి, విష్ణుప్రియలు ఈ నెల 24 నుండి 30 తేదీ వరకు కర్ణాటకలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచినందుకు గాను వారిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైవీయు ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త వెంకట్రామిరెడ్డితో పాటు ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మిదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప పార్లమెంట్ స్థానానికి పోటీ

కడప(కలెక్టరేట్), జనవరి 31: కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు బుధవారం విజయవాడ పీసీసీ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, రాష్ట్ర నేతలు సత్తార్, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, విజయజ్యోతి, మసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత ఎన్నికల మెటీరియల్ కాల్చివేత

కడప(కలెక్టరేట్), జనవరి 31: గత రెండు దశాబ్దాల క్రితం నాటి కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన పాత మెటీరియల్‌ను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పాత కలెక్టరేట్‌లో కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు దహనం చేసి పూడ్చిపెట్టారు. రాజకీయ నేతలు, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రతి గ్రామం ముందుండాలి

చెన్నూరు, జనవరి 31: అభివృద్ధిపరంగా ప్రతి గ్రామం ముందుండాలని, అలాంటప్పుడే బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వచ్చినట్లని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామనపల్లె, ముండ్లపల్లె, ఓబులంపల్లె గ్రామాల్లో రోడ్లను, నూతనంగా నిర్మించిన భవనాలను ఆయన ప్రారంభించారు.

పేదల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం





ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, నంద్యాల కొండారెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, పెద్దముడియంలో ప్రచారంలో పాల్గొన్న భూపేశ్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు ,జనవరి 31 : వైసీపీ ప్రభుత్వంలో మురికి వాడల్లోనివసించే పేదల సమస్యలు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సోములవారి పల్లెలోని పెన్నానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి , మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్‌చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు మాజీ కౌన్సిలర్లు వద్దిబాలుడు, నరసింహులు, మాజీ సర్పంచ్ సాంబశివుడు, మాజీ ఎంపీటీసీ షామీర్, బేపారీ గౌస్, భైరవుడు, ఇనయతుల్లా, విక్టర్‌విజయ్, నాగేశ్వరావు, రామచంద్రారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: వైసీపీని ఇంటికి పంపించటానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా వున్నారని టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జ్‌ప్రవీణ్‌రెడ్డి, మాజీ వీరశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీనివాసనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీనేతలు జబీవుల్లా, బాబుల్‌రెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, మస్తాన్‌గోలే, కోగటం నాయబ్, కరీముల్లా, గఫార్, తాటి శ్రీను, ఆవుల దస్తగిరి పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు బొజ్జ అరుణమ్మ, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, సుబ్బరాయుడు, శ్రీను. రాజా, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబును గద్దెనెక్కిస్తేనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసాలు అన్నారు. బుధవారం మడకలవారిపల్లె ఎస్సీ కాలనీ , మడకల వారిపల్లె, వల్లెరవారిపల్లె తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు.

24వ వార్డులో..: మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు వెంకటయ్యనగర్ తదితర ప్రాంతాల్లో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహబూబ్‌బాషా, రసూల్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం..: నిరుద్యోగ యువతను నిండా ముంచిన జగన్‌రెడ్డికి రాబోవు ఎన్నికల్లో యువతి, యువకులు గట్టిగా బుద్ధి చెప్పాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బోడితిప్పనపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. భూపేశ్‌రెడ్డి సమక్షంలో సుమారు 20 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, నాగేష్‌రెడ్డి, మాధవరెడ్డి, సత్యనారాయణ, చంద్ర, గంగయ్య, మధుసూదన్‌రెడ్డి, బాబు, రామసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.



బద్వేలు నాలుగో వార్డులో ప్రచారం చేస్తున్న లక్ష్మీదేవి, అరుణమ్మ



బద్వేలులో కరపత్రాలు పంచిపెడుతున్న జహంగీర్‌బాషా తదితరులు

పాపాలన్నీ చంకలో పెట్టుకుని
కాశీకి పోతే ఖర్మ తెగుతాదా..? : వరద

ప్రొద్దుటూరు ,జనవరి 31 : పాపాలన్నీ చంకలో పెట్టుకుని కాశీకి పోతే ఖర్మ తెగుతాదా అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన కుటుంబం అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ఎన్ని దాన ధర్మాలు చేసినా ఆయన చేసిన పాపాలు పోవన్నారు. రాచమల్లు సంపాదించిన వెయ్యికోట్ల అక్రమ సంపాదనలో చేసేదాన ధర్మాలు ఒక్కశాతం కూడా వుండవన్నారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల వున్న భూముల్లో నాలుగవ వంతు భూములు నేడు రాచమల్లు, ఆయన కుటుంబం చేతుల్లో వున్నాయన్నారు.సగరులు ,నాయీబ్రాహ్మణులు, రజకులు లాంటి కొన్నికులాల కల్యాణ మండపాలకు స్థలాలు, డబ్బులు ఇస్తుండటం ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప మరొకటి కాదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధులు ఆర్థిక సంఘం ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం వలన పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. అంతేకాకుండా సర్పంచులకున్న అధికారాలని కాలరాయబడుతున్నాయన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం నాయకులు డిమాండ్

జమ్మలమడుగు, జనవరి 31: జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పట్టణ కార్యదర్శి గోపాల్ దాస్ యేసుదాసు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఎన్జీవో హోంలో వారు విలేకరులతో మాట్లాడారు. మృతదేహాలకు చీమలు పడుతున్నా మెడికల్ సూపరింటెండెంట్ పట్టించుకోకుండా డాక్టర్లకు, సిబ్బంది ఆయన చెప్పలేకున్నారని తెలిపారు. ఆ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ సహాయ కార్యదర్శి దాసరి విజయ్, వినయ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 31 : మండలంలో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. సకాలంలో కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయడం వల్ల మండలంలోని రైతులు పంటలు పండించుకున్నారన్నారు. నీటి విడుదలకు సహకరించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జాకాకుండా చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మైలవరం, జనవరి 31: వేపరాల గ్రామం 11వ వార్డులో ఉన్న 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆ స్థలం కబ్జా కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జమ్మలమడుగు సీపీఐ సహాయ కార్యదర్శి ప్రసాద్, మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. బుధవారం మైలవరం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుకు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, మదు, ప్రసాద్, శంకర్, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

చప్పగా సాగిన మండల సమావేశం

ఎర్రగుంట్ల, జనవరి 31: ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉపమండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సభ్యులు అధికంగా పాల్గొనకపోవడంతో ఎలాంటి ప్రత్యేక ప్రశ్నలు సంధించలేదు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో భార్యలక్ష్మి, తసహీల్దార్ నాగేశ్వరరావు, జడ్పీటీసీ బాలయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

● **ఎంపీడీవో బదిలి..:** ఎంపీడీవోగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆమెను కార్యాలయ సభ్యులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఇక్కడికి అనంతపురంనుంచి ఇక్కడికి వస్తున్నట్లు సమాచారం.

టెట్, డీఎస్సీ ఒకే సారి నిర్వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 31 : ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నిర్వహించే టెట్, డీఎస్సీ పరీక్షలను ఒకే సారి నిర్వహించాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్, డీఎస్సీ ఒకే సారి నిర్వహించి ఎన్నికలు రాకముందే పరీక్ష ఫలితాలు విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. టెట్ పరీక్ష ఫీజు రద్దు చేయాలని పేర్కొన్నారు. 2022 టెట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు విద్యావలంటరీ పోస్టులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టా ఆధ్వర్యంలో పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

బ్రహ్మంగారిమఠంలో 100, మైదుకూరు పట్టణం 9వ వార్డులో 40, మండలంలో మరో 40 కుటుంబాలు



బ్రహ్మంగారిమఠం... టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, జనవరి 31 : మండంలోని రేకలకుంట్ల పంచాయతీ డి.అగ్రహారం గ్రామంలోని బుధవారం వైసీపీ నేతలైన కె.మల్లికార్జునరెడ్డి, మాధవరెడ్డి, వెంకటరమణారెడ్డి, పెద్దచెన్నారెడ్డి, నరసింహారెడ్డి, చిన్న వీరారెడ్డి ఆర్.జగన్‌మోహన్‌రెడ్డి, శివరాం, ఎం.బసిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, కె.గంగిరెడ్డితో పాటు సుమారు వంద కుటుంబాలు మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ఆపార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వివేకానందరెడ్డి మాజీ ఎంపీపీ మాలేపాటి సుబ్బారావు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు ముద్దుక్రిష్ణమనాయుడు, వెంకటేశ్‌నాయుడు, పుట్టాప్రభాకర్‌యాదవ్, సర్పంచ్ నారాయణ, నాగయ్య, రామచంద్రనాయుడు, జనసేన ఇన్‌ఛార్జ్ మల్లోత్రా, ఉమాదేవి, పొడపాటి వెంకటేశ్, భూతప్పనాయుడు, బీమానాయుడు, చెన్నుపల్లి జయరామిరెడ్డి, పూజాశివ, బసిరెడ్డి జయరామిరెడ్డి, బద్రిశివ, సుదర్శన్, కొండా ఓబయ్య, రామసుబ్బారెడ్డి టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మైదుకూరు..: పట్టణంలోని 9వవార్డు వైసీపీకి చెందిన 40 కుటుంబాలు బుధవారం టీడీపీలోకి చేరాయి. మాబు ఉస్సేన్, ఉస్సేన్‌వలి, మహ్మద్, బషీర్, రఫి, మస్తాన్, ఆసీఫ్ తదితర కుటుంబాలకు చెందిన వారు మహిళలతో కలసి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులను వారు తమ నివాసానికి బాణా సంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం పుట్టా సుధాకర్‌యాదవ్ వారికి టీడీపీ కండువాలు వేసి దాదాపు 40 కుటుంబాలవారిని పార్టీలోనికి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్, బీయన్ శ్రీనివాసులు, బీపీ సుధాకర్, ఏపీ రవీంద్ర, కటారి కృష్ణ, జనసేన ఇన్‌ఛార్జ్ మల్లోత్ర పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మండలంలోని జాండ్లవరం,తువ్వపల్లె ఎస్సీ కాలనీ,కట్టకింద పల్లె గ్రామాల్లోని 40 కుటుంబాలు మైదుకూరు ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో బుధవారం ప్రొద్దుటూరులోని పార్టీ ఆఫీసులో టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరినవారిలో మాకిరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్యకోట బాల నారాయణరెడ్డి,యనమల చంద్రశేఖర్‌రెడ్డి,నక్కా సుబ్బరామిరెడ్డి, శ్రీరాములు,రఘురాం,కంచర్ల వెంకటరమణ,కాలువపల్లి పుల్లయ్య,తాతయ్య గార్ల తెల్ల వెంకటయ్య,కాలవపల్లిసన్నా,ముత్తిగాళ్ల వెంకటేశ్, శ్రీకాంత్,ప్రసాద్,ప్రతాప్ ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రనాయుడు, మండల అధ్యక్షుడు బీమయ్య,అన్నవరంసుధాకర్‌రెడ్డి,శెట్టిపల్లె సుబ్బ రాయుడు,కిషోర్,నాగమోహన్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధి కోసమే సమాఖ్యలు



మాట్లాడుతున్న ఏవో మ్యాగి

చాపాడు, జనవరి 31: ద్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలు కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు కడప డీఆర్‌డీఏ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య అధికారి రెడ్డయ్య అన్నారు. చాపాడులోని వెలుగు కార్యాలయంలో బుధవారం సమాఖ్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని మహిళా రైతులతో ఉత్పత్తిదారుల సమాఖ్యలనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క సమాఖ్యలో 12 నుంచి 15 మంది సభ్యులు ఉంటారన్నారు. ప్రభుత్వం అందించే బ్యాంకు రుణాలు, పాడి పరిశ్రమ, రసాయనిక ఎరువులు వంటివాటి విషయంలో మొదటగా వీరికే ప్రాధాన్యత ఇస్తామన్నారు. 45 సమాఖ్యలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండల వ్యవసాయాధికారి మ్యాగి, వెలుగు ఏపీఎం రమణ మాట్లాడుతూ సమాఖ్యలు మహిళలకు చాలా అవసరమన్నారు. ఈ సమావేశంలో డీపీఎం వెంకటస్వామి, నాగేంద్ర, సీసీలు సుబ్బరత్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే చెరో 50 కోట్లు పంచుదాం రా

ప్రవీణ్‌రెడ్డికి ఎమ్మెల్యే రాచమల్లు సవాల్

ప్రొద్దుటూరు,జనవరి 31 : ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే చెరో 50 కోట్లు ఓటర్లకు పంచుదాం రా అని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డికి సవాల్ విసురుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ లేదంటే అసలు డబ్బు ప్రస్తావనే లేకుండా ఎన్నికలకు వెళదాం అంటూ రాచమల్లు ప్రవీణ్‌రెడ్డికి సవాల్ విసిరారు. ప్రొద్దుటూరు ప్రజలకు నీకుటుంబం ఏమిచేసిందో నాకుటుంబం ఏమిచేసిందో చెప్పుకుందాం.. ఎవ్వరు గెలుస్తారో చూసుకుందాం రా అంటూ ప్రవీణ్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

బద్వేలు, జనవరి 31: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం మోటారు వాహనాల కార్యాలయం ఆవరణలో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనంలో ఎక్కించరాదని సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా నెలపాటు వాహనదారులకు, విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫైర్ అధికారులచే సిలిండర్ లీక్ అయినపుడు ఆర్పే విధానంపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బి.కోడూరు, జనవరి 31 : మండల పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలలో అయిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నిరంజన్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటి నుంచి 23 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రవేశ పరీక్ష మార్చి 10వతేదీన ఉంటుందని ఆయన తెలిపారు. 4వతరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి అలాగే ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నవిద్యార్థులు ఇంటర్ ప్రవేశానికి అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు సగిలేరు గురుకులపాఠశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

హైస్కూలులో ప్లస్ పీజీటీలకు ఇంక్రిమెంటు ఇవ్వాలి

● డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్

బద్వేలు టౌన్, జనవరి 31 : 2023- 24 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో 294 ఉన్నత పాఠశాలలను హైస్కూలు ప్లస్‌గా మార్పు చేసి ఇంటర్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని హైస్కూలు ప్లస్ పిజీటీలకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పీఆర్‌టియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోండి

బద్వేలు రూరల్, జనవరి 31 : అనాథ శరణాలయంలో ఉన్న చిన్నారులందరూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, చైర్ పర్సన్ మండల న్యాయసేవాధికార సంస్థ వైజే పద్మశ్రీ కోరారు. బుధవారం సిద్దవటం రోడ్డులో ఉన్న షాలోన్ చిన్నపిల్లల అనాథ శరణాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని కోరారు.

కారు బోల్తా : ముగ్గురికి తీవ్ర గాయాలు



బి.కోడూరు, జనవరి 31 : మండల పరిధిలోని పెదుళ్లపల్లె క్రాస్ వద్ద బద్వేలు నుంచి పోరుమామిళ్లకు వెళుతున్న కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ పొలాల్లోకి దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులు పోరుమామిళ్ల పట్టణానికి చెందినఓ హోటల్ నిర్వాహకులని అక్కడున్న వారు తెలిపారు.

జగన్ టిక్కెట్ ఇస్తే పోటీలో నిలబడుతా

● మైలవరం మాజీ ఎంపీపీ అల్లె ప్రభావతి

జమ్మలమడుగు, జనవరి 31: జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనకు కేటాయిస్తే పోటీలో నిలబడుతానని మైలవరం మాజీ మండలాధ్యక్షురాలు అల్లె ప్రభావతి పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగులోని అల్లె ప్రభావతి పవర్ ప్రాజెక్టులోని ఆమె కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి, తనకు మాటలు లేకున్నా తాను జగన్ వెంటనే ఉన్నానన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గంలో సర్వే చేసినప్పుడు జమ్మలమడుగు వైసీపీ టిక్కెట్ అల్లె ప్రభావతికి ఇస్తే జమ్మలమడుగులో వైసీపీ గెలుపు ఖాయమని చెప్పినట్లుగా ప్రజలు తనకు ఫోన్లు చేసి టిక్కెట్ తెచ్చుకోవాలని చెబుతున్నారన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా తనకు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పలు కారణాల వలన తాను వెళ్లకపోవడం, క్రియాశీలక రాజకీయాల్లో వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నానని అన్నారు. జగన్ ఆదేశిస్తే ప్రజల మద్దతుతో వైసీపీలో తాను ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధిస్తానన్నారు. తనకు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభిమానులు ఉన్నారన్నారు.